పూలతోటకు.. రక్షణ కోట



అలంకార ప్రియుడు, శ్రీవేంకటేశ్వర స్వామి నిత్యపూజల కోసం రకరకాల ఫల పుష్పాలు ఉపయోగిస్తుంటారు. ప్రధానంగా తిరుమలలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనం నుంచి సేకరించిన ఫల పుష్పాలనే ఎక్కువగా వినియోగిస్తుంటారు. తిరుమల బాట గంగమ్మ అమ్మవారి ఆలయానికి ఎదురుగా 7.5 ఎకరాల విస్తీర్ణంలో పన్నీరు రోజా, చామంతి, నాటురోజా, తులసి మొక్కలు పెంచుతున్నారు. వాటిపై దోమలు, కీటకాలు ఎక్కువగా వాలుతుండటంతో నాణ్యమైన పుష్పాలు రావడం లేదు. దీనిని గమనించిన సిబ్బంది జిగురు అట్టలు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం వాటి బెడద తగ్గిందని సిబ్బంది పేర్కొంటున్నారు.

- ఈనాడు, తిరుపతి

సర్వదర్శనానికి 6 గంటలు




తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-2లోని 7 కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1లోని ఆరు కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని రూ.64,894 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.82 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

చైతన్య తరంగాలు..

హ్యాకథాన్‌కు ఐఐటీ డ్రోన్లు ◆ నాలుగు ఆవిష్కరణలతో హాజరు

విజ్ఞాన విహంగాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తూ.. సాంకేతికతను అందిపుచ్చుకొనే దిశగా తిరుపతి ఐఐటీ అడుగులు వేస్తోంది. అమరావతిలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న డ్రోన్ సమ్మిట్‌లో నాలుగు ఆవిష్కరణలతో అబ్బురపరిచింది. భవిష్యత్తు ఆవిష్కరణల దృష్ట్యా ఏపీ డ్రోన్ కార్పొరేషన్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. వ్యవసాయం, విపత్తు సహాయ చర్యల్లో దన్నుగా నిలిచేలా ఐఐటీ డ్రోన్లు ఉన్నాయి. 20 మంది విద్యార్థులు 10 మంది అధ్యాపకులు హ్యాకథాన్‌కు హాజరు కాగా ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సహాయ ఆచార్యులు డా.సర్వేంద్రనాథ్ రూపొందించిన ప్రకృతి విపత్తుల ఏరియల్ బేస్ స్టేషన్ ప్రాజెక్టుకు ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.



అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో తిరుపతి ఐఐటీ విద్యార్థులు

నాలుగు అంశాల్లో ఇలా

- వరదలు సంభవించినప్పుడు సహాయం కోసం ఎదురుచూసే వ్యక్తులను గుర్తించడం
- ప్రభుత్వ డేటాబేస్ నుంచి విపత్తుల దృశ్యాలతో రియల్ టైమ్ పీపుల్ ట్రాకింగ్
- పంట దిగుబడి అంచనా, వైఫల్యాలపై హెచ్చరిక
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో నెట్‌వర్క్‌ని పునరుద్ధరించడానికి ఏరియల్ బేస్ స్టేషన్

ఈ ప్రదర్శన మంచి అవకాశం



డ్రోన్ సమ్మిట్‌కు రావడం చాలా ఆనందంగా ఉంది. కొత్త ఆవిష్కరణలు ప్రోత్సహించే విధంగా ఈ సమ్మిట్ జరుగుతోంది. వివిధ రకాలు డ్రోన్లు అవి ఉపయోగపడే విధానం గురించి తెలుసుకునేందుకు మంచి అవకాశం లభించింది. మేము తెచ్చిన డ్రోన్లు ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

– ఇమ్రాన్, విద్యార్థి, ఐఐటీ తిరుపతి

సాంకేతికత తెలుసుకునేందుకు



మేము ఫ్లడ్ ట్రాకర్ డ్రోన్ ప్రదర్శించేందుకు వెళ్లాం. సృజనాత్మకను పెంపొందించి నూతన పారిశ్రామిక విధాన నిర్మాణానికి ఈ సమ్మిట్ ఉపయోగంగా ఉంది. ఇతర ప్రాంతాలతో కలిసి పోటీపడటం గర్వంగా ఉంది. కొత్త సాంకేతికతను తెలుసుకునేందుకు ఇదొక వేదిక.

– అయూష్, విద్యార్థి, ఐఐటీ తిరుపతి

సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుత సమాజానికి కాకుండా ముందస్తు రోజుల్లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా గుర్తించే డ్రోన్లు ఈ సమ్మిట్‌కు వచ్చాయి. తిరుపతి ఐఐటీ నుంచి అద్భుత ఆవిష్కరణలతో హాజరయ్యాం. అందులో ఒక దానికి బహుమతి రావడం సంతోషంగా ఉంది.

– డా.రోషన్ శ్రీవత్సవ్, ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్ట్ డైరెక్టర్



ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు అందజేస్తున్న ఐఐటీ ఆచార్యులు

డ్రోన్ టెక్నాలజీ భాగస్వామిగా తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, న్యూస్‌టుడే: డ్రోన్ టెక్నాలజీకి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు తిరుపతి ఐఐటీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇంటిగ్రేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, స్టార్టప్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం వంటి కీలక రంగాల్లో సాంకేతిక అభివృద్ధిపై ఐఐటీ దృష్టి పెట్టనుంది. ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు, సాంకేతిక పురోగతుల ఆవిష్కరణలు పెంపొందించడమే లక్ష్యంగా ఒప్పందం కుదుర్చుకుంది.

దీపావళి కానుకగా.. ఉచిత సిలిండర్లు



రేపటి నుంచే బుకింగ్‌కు అవకాశం

తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ హామీ అమల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. మహిళలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈనెల 23న జరగనున్న సమావేశంలో పథకానికి ఆమోదం లభించడం ఆవెంటనే మార్గదర్శకాలు వెలువడటమే ఇక మిగిలింది.

తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరులు మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి అర్హులు. దీపం, ఉజ్వల లబ్ధిదారులకు పథకం సులువుగా వర్తించనుంది. గ్యాస్ కనెక్షన్ ఉండి, ఆర్థికంగా వెనకబడినవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. బీపీఎల్ కుటుంబాలు, తెల్లరేషన్ కార్డు ఉన్న వారిని ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, బ్యాంక్‌ఖాతా, రేషన్‌కార్డు, విద్యుత్తు బిల్లు, నేటివిటీ వంటి వాటికి సంబంధించి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

నేరుగా ఖాతాకు నగదు

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించేందుకు ఈనెల 24వ తేదీ నుంచి బుకింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా లబ్ధిదారు ఒక ఉచిత సిలిండర్ పొందేలా పౌరసరఫరాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లబ్ధిదారులకు నేరుగా వారివారి బ్యాంకు ఖాతాలో రాయితీ జమకానుంది. సిలిండర్ ధర రిటైల్‌లో రూ.876 ఉండగా, కేంద్ర ప్రభుత్వం ప్రతి సిలిండర్‌కు రూ.25 రాయితీ ఇస్తోంది. మిగిలిన రూ.851 చొప్పున మూడు సిలిండర్లకుగాను ఏడాదికి రూ.2,553 లబ్ధిదారుల ఖాతాలకు జమకానుంది.

జిల్లాలో లబ్ధిదారుల వివరాలు → మొత్తం- 4,92,302 ఏజెన్సీలు- 41

ఓడినా మారలే.. దుర్మార్గాలు వీడలే

జిల్లాలో వైకాపా మూకల హింసాకాండ



ఈనాడు డిజిటల్, తిరుపతి: ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలను హింసించిన వైకాపా మూకలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలైనా ఆ పాత వాసనలు వదలడం లేదు. నిత్యం ఏదో ఒక మూలన కూటమికి ఓటేసిన సామాన్య ప్రజలు, తెదేపా కార్యకర్తలను వెంటాడిమరీ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఐదేళ్ల రాక్షస పాలనకు ముగింపు పలుకుతూ అభివృద్ధికి పట్టం కట్టారు. కూటమి ప్రభుత్వం ఏడింటికి ఏడు నియోజకవర్గాల్లో జయకేతనం ఎగరేసింది. పలువురు బాధితులు గత పాలనలో జరిగిన అన్యాయం గురించి నేరుగా సీఎం చంద్రబాబుతోనే మొరపెట్టుకుంటున్నారు. ఇలాంటి సందర్భంలో తమ దుర్మార్గాలన్నీ బయటపడతాయనే ఈ తరహా దాడులు చేస్తున్నట్లు సమాచారం.

తెదేపాకు ఓటేశారనే కోపంతో...

ఇటీవల జిల్లాలో జరిగిన పలు ఘటనల్లో బాధితులంతా తెదేపాకు ఓటేసిన వాళ్లే. ఎన్నికల ప్రచారంలో వైకాపాకు వ్యతిరేకంగా పని చేస్తూ, కూటమి గెలుపునకు కృషి చేశారనే అక్కసుతోనే కక్షగట్టి మరీ విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం దాడులను ఖండిస్తూనే అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది.

పలు ఘటనలు పరిశీలిస్తే

- ఎన్నికల్లో చురుకుగా ప్రచారం చేశారనే కోపంతో చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త గోపాల్‌పై అదే గ్రామానికి చెందిన వైకాపా మూకలు పోలింగ్ జరిగిన మరుసటి రోజే దాడిచేశారు.
- ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గేందుకు కారణమయ్యారని తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగకు చెందిన తెదేపా కార్యకర్త సురేష్ ట్రాక్టర్‌లో వెళ్తుండగా అడ్డుకొని దాడికి పాల్పడ్డారు. అప్పుడే ఘటనాస్థలానికి చేరుకున్న సురేష్ భార్య, బంధువులపైనా విచక్షణ మరిచి దాడి చేశారు.
- తాజాగా చిల్లకూరు మండలం నాంచారపేటకు చెందిన తెదేపా కార్యకర్త హరిప్రసాద్ హత్య జరిగింది.

విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీలు



వంటగదిలో కాలం చెల్లిన చిక్కీలు

పాకాల, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని న్యాయవాదులు చంద్రమోహన్, సునీల్ మంగళవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. వంటగది, వంటలో వినియోగిస్తున్న పదార్థాలను వారు పరిశీలించారు. ఆగస్టు నెలారంభంలో తయారు చేసిన చిక్కీలను 60 రోజులలోపు వినియోగించాలి. ఐతే వాటిని ఇప్పటికీ విద్యార్థులకు ఇస్తున్నట్లు, మరో 9 బాక్సులు మిగిలి ఉన్నట్లు గుర్తించారు. హెచ్‌ఎం మహమ్మద్ రఫీ సెలవులో ఉండగా రమేష్ కుమార్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నట్లు న్యాయవాదులు తెలియజేశారు. కోర్టు సిబ్బంది మధుసూదన్, మీనా తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక లేఔట్‌కు రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి..!

ఈనాడు–తిరుపతి: ఏర్పేడు మండలం వికృతమాల ఎస్సీకాలనీ సమీపంలో అనధికారిక లేఔట్‌కు రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఓ నాయకుడు ఒత్తిడి తేవడం చర్చనీయాంశమైంది. ఇక్కడి స్థలం విషయమై ఏళ్లుగా వివాదాలు జరుగుతున్నాయి. ఓ ప్రైవేటు సంస్థ ఎనిమిది ఎకరాల్లో లేఔట్ వేయగా.. చుట్టూ ఉన్న డీకేటీ స్థలాలు, నదీ తీరం, కాల్వ పోరంబోకు భూములు కలుపుకొని 13 ఎకరాల వరకు లేఔట్‌ను సిద్ధం చేశారు. వైకాపా హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు దీన్ని క్రమబద్ధీకరించాలంటూ అప్పట్లో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ఒత్తిడి చేశారు. దీనిపై తరచూ కథనాలు రావడం, ఎన్నికలు సమీపించడంతో అధికారులు ఆ సాహసాన్ని చేయలేకపోయారు. ఇదే వివాదాస్పద స్థలంలో అనధికారిక లేఔట్‌ను రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.



భక్తులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

అదనపు ఈవో ఆకస్మిక తనిఖీలు

తిరుమల, న్యూస్‌టుడే: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆహారం రుచి, నాణ్యతను పరిశీలించి భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు నాణ్యతపై సంతోషం వ్యక్తం చేశారు. అన్నదానం డిప్యూటీ ఈవో రాజేంద్ర, ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

స్వదేశీ దర్శన్.. నాణ్యత డొల్ల

- రూ.కోట్ల పనుల్లో నిర్లక్ష్యం
- ఊడిపడుతున్న సీలింగ్
- కానరాని బోటు షికారు



అటకానితిప్ప వద్ద బోటు షికారు కోసం ఏర్పాటు చేసిన గుంత

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పులికాట్, నేలపట్టు పక్షుల కేంద్రాలతోపాటు వేనాడులో పర్యాటకులకు కాస్తా ఆహ్లాదం కల్పించేందుకు వీలుగా స్వదేశీ దర్శన్ నిధులతో చేపట్టిన పనులు కనుమరుగవుతున్నాయి. వసతులు అందుబాటులోకి రాక మునుపే నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే రెండు ప్రాంతాల్లో సీలింగ్ ఊడి పడింది. అటకానితిప్పలో బోటు షికారు కోసం ఏర్పాటు చేసిన గుంత మూణ్నాళ్ల ముచ్చటగా తయారైంది. ప్రస్తుతం పక్షుల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సందర్శకులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పేరిట 2017లో సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లోని వన్యప్రాణి విభాగం పరిధిలోని భీమునివారిపాళెం ఓడరేవునకు రూ.1.84 కోట్లు, నేలపట్టుకు 5.32 కోట్లు, అటకానితిప్పలోని పర్యావరణ కేంద్రంలో అభివృద్ధి పనులకు రూ.1.20 కోట్లు, వేనాడుకు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో సందర్శకులను ఆకట్టుకునేందుకు వీలుగా పలు రకాల అభివృద్ధి పనులు చేయాలని డిజైన్లు రూపొందించి, ఆ మేరకు పనులు చేపట్టారు. వీటిల్లో చిన్న పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదకరంగా ఉండేలా నాలుగు ప్రాంతాల్లో పనులు చేశారు.

వాస్తవ పరిస్థితి ఇలా..

శ్రీహరికోట రోడ్డులోని పులికాట్ సరస్సులో వన్యప్రాణి విభాగం పరిధిలోని అటకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పర్యటకులను ఆకర్షించేలా, వారిని ఆహ్లాద పరచాలన్న ఉద్దేశంతో బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. పనులకు టెండర్లు నిర్వహించగా ఓ గుత్తేదారు దక్కించుకున్నారు. సదరు గుత్తేదారు పనులు చేయకనే మరొకరికి ఆ బాధ్యతను అప్పగించారు. కట్ట మట్టి జారిపోకుండా గుంత లోపల రివిట్‌మెంటు ఏర్పాటు చేశారు. ఈ పనులు సక్రమంగా చేయకపోవడంతో పలుచోట్ల కుంగిపోయింది. సందర్శకుల కోసం రెస్టారెంట్ నిర్మాణం చేపట్టగా ప్రారంభించక ముందే సీలింగ్ ఊడి కిందపడుతోంది.



వేనాడులో..

పులికాట్ సరస్సులోని వేనాడులో అల్లా తాత దర్గా ఉంది. ఇక్కడకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ ప్రాంతంలోనూ విదేశీ విహంగాలు సేద తీరుతుంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ రూ.2 కోట్లతో సందర్శకుల కోసం భవనాన్ని నిర్మించి, వసతులు ఏర్పాటు చేశారు. ఇది ప్రారంభం కాకమునుపే దెబ్బతింది. సీలింగ్ ఊడి పడిపోయింది. భీమునివారిపాళెం, నేలపట్టులో నిర్మించిన నిర్మాణాలు సైతం పాడయ్యాయి.

వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు

అటకానితిప్ప, వేనాడులో స్వదేశీ దర్శన్ పేరుతో చేసిన పనులు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. వాటిని బాగు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. వేనాడులో నిర్మాణాలకు సంబంధించి గుత్తేదారుకు ఇంకా బిల్లులు రావల్సి ఉంది. బోటు షికారు కూడా అందుబాటులోకి తీసుకొస్తాం.

– నరసింహారావు, పులికాట్ ఆర్వో

మద్యం రికార్డులపై.. సీఐడీ



ఎస్వీఆర్ డిస్టిలరీలో సోదాలు చేస్తున్న సీఐడీ అధికారులు, సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో మద్యం తయారీ.. విక్రయాలపై సీఐడీ దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మద్యం డిస్టిలరీల్లో రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ విభాగాల సహకారంతో సోదాలకు దిగింది. అందులో భాగంగా తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఎస్వీఆర్ డిస్టిలరీలో మంగళవారం ఉదయం నుంచి రాత్రివరకు తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ పద్మలత నేతృత్వంలోని బృందాలు దర్యాప్తులో పాల్గొన్నాయి.

బ్రాండ్ల ప్రమోషన్‌పై వివరాల సేకరణ

మద్యం తయారీలో నాణ్యతపై ఆరా

ఐదేళ్ల వివరాల పరిశీలన

ఏపీ బ్రేవరైజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపోలకు ఐదేళ్లలో ఎంత మద్యం పంపారు, తయారీలో ఎలాంటి స్పిరిట్ వాడారు.. ఎక్కడ కొనుగోలు చేశారు, గతంలో ఎంత ధర ఉండేది.. ఐదేళ్లుగా ఎంత ధర పెంచారు, ఏ తేదీ నుంచి ఏపీబీసీఎల్ డిపోలకు పంపుతున్నారు, తయారీ యంత్రాలు, పరికరాల సామర్థ్యం ఎంత.. మద్యం తయారీ సమయంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు మళ్లీ ఎలా వినియోగించారనే అంశాల గురించి ఎస్వీఆర్ డిస్టిలరీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత దస్త్రాలు పరిశీలించారు. కొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. తయారీకి వినియోగించే ఎల్రక్టా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్‌ఏ) ఎక్కడ.. ఎంతమేరకు కొనుగోలు చేశారనే విషయాలు సంబంధించి పరిశీలించారు. సంస్థ ప్రతినిధులు వెల్లడించే వివరాలను వీడియో రికార్డు చేసుకున్నారు.

కొత్త సీసాలో పాత మద్యం

వైకాపా ప్రభుత్వంలో తయారు చేసిన నాసిరకం మద్యాన్ని ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకుంటుందనే ఉద్దేశంతో కొత్త బ్రాండ్ల పేరుతో పాత మద్యం విక్రయించే అవకాశాలున్నట్లు గుర్తించి సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగానే మద్యం సీసాలకు వేసే హైసెక్యూరిటీ సీళ్లను ఎస్వీఆర్ డిస్టిలరీలో పరిశీలించినట్లు సమాచారం. ఆ సీళ్లు ఎక్కడ.. ఎవరి వద్ద కొనుగోలు చేశారనే విషయాలను పరిశీలించారు.

రెక్టిఫైడ్ స్పిరిట్‌పై నిఘా

తక్కువ ధరకు లభించే రెక్టిఫైడ్ స్పిరిట్ తీసుకొచ్చి కొన్ని రంగులు (ఎసెన్స్) కలిపి నాసిరకం మద్యం తయారు చేయడంతో ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోందన్న ఆరోపణలు ఐదేళ్లుగా వినిపించాయి. మద్యం తయారీలో రెక్టిఫైడ్ స్పిరిట్ వినియోగించిన సందర్భం ఏమైనా ఉందా అని ఆరాతీశారు. ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం ఇక్కడి మద్యాన్ని పక్క రాష్ట్రాల్లో తనిఖీ చేయించి వాస్తవాలు వెల్లడించారు. రాష్ట్రంలో మద్యం తయారుచేసే డిస్టిలరీలు ఎక్కువగా అధికార పార్టీ నేతలకు చెందినవి కావడంతో బాటలింగ్ యూనిట్‌లోని డిస్టిలరీ సర్టిఫైడ్ అధికారి చూసీచూడనట్లు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపై సీఐడీ దృష్టి పెట్టిందనే ప్రచారం జరుగుతోంది.

ఎమ్మార్సీ, పాఠశాలలకు రూ.2.91 కోట్లు

తిరుపతి (బైరాగిపట్టెడ): రాష్ట్రంలోని నూతన ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టిసారించింది. వాటి పరిష్కారంపై శ్రద్ధ కనబరుస్తూ విద్యార్థుల ఉన్నతి లక్ష్యంగా అడుగులు వేస్తోంది. తిరుపతి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం మండల రిసోర్స్ కేంద్రాల పరిధిలో మండలానికి రూ.1,30,000 చొప్పున మంగళవారం విడుదల చేశారు. అన్ని మండలాలకు కలిపి రూ.44,22,000 జమకానున్నాయి. స్కూల్ గ్రాంట్స్ కింద జిల్లాలోని 2,219 పాఠశాలలకు రూ.495.3 లక్షలు మంజూరయ్యాయి. తొలి విడతగా మంగళవారం రూ.247.65 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులను జిల్లాలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఆధ్వర్యంలో ఖర్చు చేస్తారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల బ్యాంకు ఖాతాలకు సమగ్ర శిక్షా విభాగం నుంచి నిధులను విడుదల చేస్తారు. ఈ నిధులతో పాఠశాలల్లో విద్యుత్ ఛార్జీలు, మరమ్మతులు, నిర్వహణ ఖర్చులకుగాను వినియోగించనున్నారు.

పాఠశాలలకు పీఎంశ్రీ నిధులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా పురుడు పోసుకున్న పీఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద తొలివిడతలో ప్రాథమిక నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో మొదటి విడతలో 23, రెండో విడతలో 17 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.38 లక్షల నిధులు కేంద్రం నుంచి తొలుత విడుదలయ్యాయి. ఈ నిధులను ఆయా పాఠశాలల్లో క్రీడా మైదానాలు, విద్యార్థులకు అవసరమైన సైన్స్ ప్రయోగశాలల ఏర్పాటుకు ఉపయోగించనున్నారు. మొత్తం ఐదు విడతల్లో నిధులు విడుదల కానున్నట్లు జిల్లా అధికారులు వెల్లడించారు.

కేంద్ర ప్రాజెక్టులకు శరవేగంగా భూసేకరణ

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కేంద్ర రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం జేసీ శుభం భన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. రేణిగుంట-చెన్నై నాలుగులైన్ల రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభించాలన్నారు. భూసేకరణ పూర్తికాకపోతే జాతీయ ప్రాజెక్టులు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జాతీయ రహదారి 205కు సంబంధించి కొత్త ప్రతిపాదనలు ఆధారంగా భూసేకరణ పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, అధికారులు వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు, అరుణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డా.వెంకటేశ్వర్, చిత్రంలో జేసీ శుభం భన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

యువత ఉపాధి కల్పనకు చర్యలు

జిల్లాలోని పాలిటెక్నిక్ డిప్లొమో, ఐటీఐ, నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లా పరిధిలో అత్యధిక పరిశ్రమలు ఉన్నాయని.. పరిశ్రమల అవసరాల మేరకు మానవ వనరుల మ్యాపింగ్ ద్వారా ఉపాధి చూపించాలన్నారు.

'వెలుగుపూల కోసం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అధ్యాపకులు

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు ఎస్వీ రమేష్‌కుమార్ రచించిన 'వెలుగుపూల కోసం..' కవితా సంపుటి ఆవిష్కరణ కళాశాల ఆవరణలో మంగళవారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపల్ మొహిద్దీన్ బాషా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి పఠనాసక్తిని అలవర్చుకోవాలని, సమాజాన్ని సంస్కరించగలిగే సమర్థవంతమైన ఆయుధం కవిత్వమని పేర్కొన్నారు. పుస్తకంలోని కవితల్ని మదనపల్లి బీటీ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాసులు విశ్లేషించారు. పాకాల, ఐరాల జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు ఉమామహేశ్వరి, రెడ్డిరామరాజు, రచయిత ఎస్వీ రమేష్‌కుమార్, తెలుగు అధ్యాపకుడు ఈశ్వరబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సత్యవేడు, న్యూస్‌టుడే: అమరావతిలో ముఖ్యమంత్రి సచివాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడుని మంగళవారం సత్యవేడు తెదేపా మండలాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు వీకేఎన్ బాషలు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.4లక్షల 38 వేల చెక్కును అందజేశారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గ ప్రస్తుత పరిస్థితులను వివరించారు. శశిమోహన్, కె.ప్రభాకర్‌రెడ్డి, రామాంజనేయులు వారివెంట ఉన్నారు.

మార్చిలోగా చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిచేయాలి



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న జేఈవో గౌతమి తదితరులు

తిరుపతి (వైద్యవిభాగం, బైరాగిపట్టెడ): అలిపిరి జూపార్క్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను తితిదే జేఈవో గౌతమి మంగళవారం పరిశీలించారు. తితిదే ప్రతిష్ఠాత్మకంగా ఆరు అంతస్థులతో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. 2025 మార్చిలోగా పనులు పూర్తి చేసేందుకు అదనంగా కార్మికులను వినియోగించాలని ఆమె ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు గౌతమి వివరించారు. ముందుగా నిర్మాణ పనులపై సమీక్షించారు. సివిల్, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వెంట స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్.వి.కుమార్, సీఈ సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా.శ్రీనాథ్ రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈలు కృష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్ పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో పసిడి పతకం



మొదటి స్థానంలో ప్రణీత్ కుమార్ (మధ్యలో)

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: దక్షిణాది జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన బి.ప్రణీత్ కుమార్ సత్తాచాటాడు. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్‌లో పదో తరగతి చదువుతున్న ప్రణీత్ కుమార్ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో జరిగిన అండర్- 16 బాలుర విభాగంలో షాట్‌పుట్‌లో ప్రణీత్ కుమార్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా అథ్లెట్ ప్రణీత్ కుమార్‌ను, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రసాద్‌ను భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్ర గౌరవ సంచాలకులు ఎన్.సత్యనారాయణరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోలర్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన స్నేహ కృతి

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ అండర్- 17 రోలర్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారిణి కె.స్నేహ కృతి ప్రతిభ కనబరిచింది. ఇటీవల కాకినాడ వేదికగా జరిగిన పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన స్నేహ కృతి ప్రథమ స్థానం కైవసం చేసుకుని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా శిక్షకుడు బాబ్జి, క్రీడాకారిణి స్నేహను పలువురు అభినందించారు.

పెళ్లకూరు జడ్పీటీసీ సభ్యురాలికి అవమానం!



పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు జడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లాను వైకాపా నేతలు అవమానపర్చడం సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. సోమవారం చిల్లకూరులో వైకాపా నేత సత్యనారాయణరెడ్డి ఇంట్లో జరిగిన వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియా సమావేశంలో ఆమెను వెనుక నిల్చోపెట్టడం చర్చగా మారింది. ఆమె ఎస్సీ మహిళ కాగా ఇలా తరచూ ఎస్సీ ప్రజాప్రతినిధులను సత్యనారాయణరెడ్డి అవమానపర్చడం మామూలుగా మారింది.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్స్	209
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	238
లేయర్ మాంసం	195

ఎన్నటికో.. అభివృద్ధి

● టెండర్లయినా అలసత్వమే ● ప్రారంభంకాని సువర్ణముఖి అభివృద్ధి



సువర్ణముఖి నది ఆనకట్ట వద్ద వృథా అవుతున్న నీరు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జిల్లాలో తాగు, సాగునీటి వరప్రసాదంగా ఆదుకుంటున్న సువర్ణముఖి నది అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. జైకా నిధులతో పనుల నిర్వహణకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గత ప్రభుత్వం అయిదేళ్లుగా హామీలిస్తూ వచ్చి ఆఖరున శిలాఫలకాన్ని వేసి చేతులు దులుపేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వం దీనిపై శ్రద్ధ కనబరచలదు. టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించేందుకు ముహూర్తం కుదరకపోవడం గమనార్హం. చంద్రగిరి సమీపంలోని అగస్త్యాచలంపై పుట్టిన సువర్ణముఖి నది తొండవాడ సమీపంలో కల్యాణీ, భీమా నదులతో సంగమించి జిల్లాలోనే అత్యంత పెద్ద నదిగా ఖ్యాతిని గడించింది. చంద్రగిరి, తిరుచానూరు, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పెళ్లకూరు, నాయుడుపేట, వాకాడు మండలాల్లోని తీర ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తోంది.

ఆనకట్ట అభివృద్ధి ఏదీ

నదిపై నీలం సంజీవరెడ్డి హయాంలో నిర్మించిన ఆనకట్టను అభివృద్ధి చేసేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆనకట్ట ప్రదేశంలో బ్యారేజ్ నిర్మాణానికి జైకా ద్వారా రూ.58.40 కోట్ల నిధులతో టెండర్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం 8 వేల ఎంసీఎఫ్‌టీల నీటి నిల్వలున్న నదిలో పనులు పూర్తయితే 25 వేల ఎంసీఎఫ్‌టీల మేర నీటి నిల్వలు ఉండే అవకాశముంది. ఈ పనుల నిర్వహణకు సంబంధించి జనవరిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నెలలు గడిచిపోతున్నా పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఇందుకోసం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ సభ్యులు దీనిపై అధ్యయనం చేస్తోందని అధికారులు చెప్తున్నారు. మొన్నటికి మొన్న ఇందుకోసం నియమించిన కమిటీ సువర్ణముఖి నది ఆనకట్టను పరిశీలించి వెళ్లినట్లు సమాచారం.

ఆయకట్టు అపారం

సువర్ణముఖి నది ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారు. ప్రత్యక్షంగా పాతికవేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. నది గుండా వృథా అయ్యే నీటికి అడ్డుకట్ట వేసి రైతులకు సాగు జలాలుగా మళ్లించాలన్న ఉద్దేశంతో నీలం సంజీవరెడ్డి హయాంలో ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడి నీటిని చెంబేడు కాల్వ గుండా మళ్లించి తద్వారా కాల్వకు అనుసంధానంగా ఉన్న 37 చెరువులకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 10 వేల ఎకరాలకు పైగా సాగునీరు సరఫరా అవుతోంది.

'కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు'



ఆసుపత్రిలోకి వెళ్తున్న ఎమ్మెల్యేలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి విజయాన్ని జీర్ణించుకోలేక వైకాపా నాయకులు దుర్మార్గాలకు పాల్పడుతున్నారని.. తెదేపా శ్రేణుల ఓపికను పరీక్షించవద్దని సర్వేపల్లి, గూడూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. చిల్లకూరు మండలం నాంచారంపేటకి చెందిన తెదేపా కార్యకర్త హరిప్రసాద్ భౌతిక కాయానికి గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్‌తో కలిసి, ఎమ్మెల్యేలు, నాయకులు మంగళవారం నివాళి అర్పించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. వైకాపా నాయకులు అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని తెలిపారు. వైకాపా పాలనలో అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌ని.. అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. హరిప్రసాద్ హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. హరిప్రసాద్ కుటుంబానికి రూ.5లక్షలు అందజేస్తామని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, నాయకులు తానంకి నానాజీ, భాస్కర్‌రెడ్డి, చెంచురామయ్య, శ్రీనివాసులు, నాగరాజు, వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల బలోపేతానికి ప్రణాళికలు

చిత్తూరు(వ్యవసాయం): మార్కెట్ కమిటీల చెక్‌పోస్టుల బలోపేతానికి పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంచాలకులు(జేడీ)రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షించారు. మార్కెట్ కమిటీల్లో అక్రమాల అడ్డుకట్ట, ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని, వీరు చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తారన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల ఏడీలు పరమేశ్వరన్, సురేంద్ర పాల్గొన్నారు.

సర్వశిక్షాలో గాలికొదిలేశారు

రూ.2.3 కోట్లకు పైగా విలువచేసే ల్యాప్‌టాప్‌లు నేలపైనే



కిటికీ దగ్గరగా పేర్చిపెట్టిన ల్యాప్‌టాప్‌లు ▶క్లిక్కర్స్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: సర్వశిక్షా విభాగంలో సదా నిర్లక్ష్యం కనిపిస్తోంది. రూ.2 కోటలకు పైగా విలువచేసే 204 ల్యాప్‌టాప్‌లను గదిలో మూలన అలా పడేశారు. వాటికి కనీసం రక్షణ లేదు. వర్షాలకు కిటికీలోంచి జల్లులు పడే అవకాశం ఉన్నా నేలపై పేర్చేశారు. వాటికి కనీసం కవర్లు లేవు. భద్రత కోసం విధిగా ఉండాల్సిన అట్టపెట్టెలు కనిపించడం లేదు. వాటికి మొదట్లో ఇచ్చిన బ్యాగులు ఎక్కడున్నాయో తెలియదు. విభాగంలో సిబ్బంది పదిమంది వరకు అందుబాటులో ఉన్నారు. వారంతా అదే కార్యాలయంలో పక్కన మరో రెండు గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ల్యాప్‌టాప్‌ల రక్షణ తమది కాదన్నట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంత ల్యాప్‌టాప్‌లు అయితే అలా మూలన పడేస్తారా.. గాలికి వదిలేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ గదులను ప్రారంభించింది. ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేసి ఎస్ఈఆర్‌టీ పాఠ్యాంశాలను ప్రదర్శించేవారు. జిల్లాలో 204 డిజిటల్ పాఠశాలలు ఎంపిక కాగా ఆ మేరకు ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ తెరలు ఇతర సామగ్రిని అందజేశారు. రూ.2.3 కోట్లు వెచ్చించారు. ప్రభుత్వం మారిన వెంటనే ఆ విధానం సరిగా లేదని, లోపాలు ఉన్నాయని గుర్తించి సామగ్రిని జిల్లా కేంద్రానికి తెప్పించి ఇలా నిర్లక్ష్యంగా పడేశారు.

ముక్కంటి ఆలయ ఈవోగా బాబిరెడ్డి..!

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా బాబిరెడ్డి వచ్చే అవకాశముందని కూటమి నేతల్లోనూ, ఆలయ ఉద్యోగుల్లోనూ చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఈవోగా తిరుపతి ఆర్జేసీగా ఉన్న చంద్రశేఖర్‌ఆజాద్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే స్థానిక ప్రజాప్రతినిధికి ఆయనకు సన్నిహితం లేక పోవడం, ఇటీవల మీడియా సమావేశంలోనూ త్వరలో కొత్త ఈవో వస్తారని ప్రజాప్రతినిధి చెప్పడం చర్చనీయాంశమైంది. అయితే ఈ నేపథ్యంలో నెల్లూరు రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న బాబిరెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఐదో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 85000 21856, 94908 06942లో సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆక్సిలెంట్ ఫార్మాకు 'హెల్త్ కెనడా' ధ్రువపత్రం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ప్రతిష్ఠాత్మక 'హెల్త్ కెనడా కరెంట్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' (సీజీఎంపీఎస్) ధ్రువపత్రం దక్కింది. కంపెనీ నాన్-స్టెరైల్ సదుపాయానికి ఈ గుర్తింపు అందుకుంది. దీనిపై ఆక్సిలెంట్ ఫార్మా కంపెనీ ఛైర్మన్ జితేష్ దేవేంద్ర స్పందిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు తమ సంస్థ ఉత్పత్తుల నాణ్యతకు నిదర్శనంగా మరింత విలువను జోడిస్తుందన్నారు.

హ్యాండ్‌బాల్ అండర్-14

ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

పూతలపట్టు, న్యూస్‌టుడే: హ్యాండ్‌బాల్ అండర్-14 ఉమ్మడి జిల్లా జట్టును మంగళవారం పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా కార్యదర్శి వసంతవాణి ప్రకటించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు కలకడ మండలం కోన జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బాలుర జట్టు: గోవర్ధన్‌నాయక్, వసంతకుమార్, చైతన్య(అంబేడ్కర్ గురుకుల పాఠశాల, పి.కొత్తకోట), సాయినాథ్, పాయాజ్(జడ్పీ ఉన్నత పాఠశాల, కోన), యవరాజ్, కార్తికేయ రాజు(జడ్పీ ఉన్నత పాఠశాల, చెంబకూరు), గణేష్, గోవర్ధన్(జడ్పీ ఉన్నత పాఠశాల, చెరుకువారిపల్లె), లోకేష్‌నాయక్, ఓం ప్రకాష్ (ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల, గ్యారంపల్లె), జీవన్ తేజ (జడ్పీ ఉన్నత పాఠశాల, సీటీఎం), గౌతమ్(జడ్పీ ఉన్నత పాఠశాల, ఎల్లంపాడు), చైతన్య(జడ్పీ ఉన్నత పాఠశాల, పూతలపట్టు), సునీల్(జడ్పీ ఉన్నత, సిద్ధంపల్లె), శశాంక్(మదనపల్లి).

బాలికల జట్టు: జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని కావ్య, మౌనిక(రంగంపేట), సఫీయ, కీర్తన(ఈడిగపల్లె), నిహారిక, అర్చన(చెరుకువారిపల్లె), పావనిప్రియ(సీటీఎం), జయనబ్‌ఖాన్, మోషిత(కోన), శ్రీలేఖ(మదనపల్లి), దీక్షిత(జి.కొత్తపల్లె), అమృత(గొల్లపల్లె), జాయిప్రియ, నిహిత(పూతలపట్టు), పూజ(ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాకాల).

నేలపట్టులో విద్యార్థుల సందడి

దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో మంగళవారం విద్యార్థుల సందడి నెలకొంది. గుంటూరులోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు నేలపట్టుకు చేరుకుని విహంగాలను వీక్షించారు. టూరిజం గైడ్ హుస్సేన్‌బాబు వలస పక్షుల ప్రాముఖ్యత, నేలపట్టు విశిష్టత వివరించారు. - న్యూస్‌టుడే, దొరవారిసత్రం



విహంగాలను వీక్షిస్తున్న విద్యార్థినులు



సందర్శకులను ఆకట్టుకుంటున్న గూడబాతులు

మరణంలోనూ వీడని స్నేహం



▶ వెంకటరమణారెడ్డి ▶ వెంకటసుబ్బారెడ్డి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాకేశ్

మనుబోలు, న్యూస్‌టుడే: వారిద్దరు స్నేహితులు.. ఏ పనిచేయాలన్నా కలిసే ఉంటారు. . ఎంతో ఆప్యాయంగా ఉన్న వారిపై విధి చిన్నచూపు చూసింది.. బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది.. కారు కొనుగోలు చేసేందుకు వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు.. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వారిపై దూసుకెళ్లడంతో స్నేహితులిద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మనుబోలు మండలం బద్దెవోలు అడ్డరోడ్డు సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు...కోట మండలం విద్యానగర్‌కు చెందిన సిద్దారెడ్డి వెంకటరమణారెడ్డి(60), పొణకా వెంకటసుబ్బారెడ్డి(60) స్నేహితులిద్దరూ కారు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై నెల్లూరు బయల్దేరారు. అనంతరం స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. గూడూరు డిపో ఆర్టీసీ బస్సు కొలనుకుదురు వెళుతుండగా, బద్దెవోలు అడ్డరోడ్డు కూడలిలో మలుపు తిరుగుతూ అదుపుతప్పి నెల్లూరు నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో వెంకటరమణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటసుబ్బారెడ్డి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాకేశ్ తెలిపారు.

పోలీస్ వాహనంపై దాడి..

13 మందిపై కేసు

పెళ్లకూరు: పెళ్లకూరు మండలం చిల్లకూరులో 20 తేదీన జరిగిన ఘర్షణలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా పికెట్ విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ నరసింహరావు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. గొడవ సర్దుబాటు చేసేందుకు వచ్చిన నాయుడుపేట సీఐ, ఇతర సిబ్బంది వాహనాన్ని అడ్డుకోవడం, కర్రలు, రాళ్లతో దాడి చేసిన వారిపై కేసులు నమోదయ్యాయి.

ఒకే కుటుంబం.. చోరీల చరిత్ర

మరో ఇద్దరు నిందితుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణంలో ఒకే రాత్రి మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన కేసులో మరో ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. మంగళవారం సీఐ చిన్న గోవిందుతో కలిసి సీసీఎస్‌లో నిందితుల వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20వ తేదీన తిరుమలనగర్, రెవెన్యూ కాలనీలోని మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. రూ.29 లక్షల విలువైన బంగారు, వెండి, నగదు కాజేశారు. ఘటనపై కేసు నమోదు చేశాక నాలుగు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. మంగళవారం స్థానిక రామానుజపల్లి చెక్‌పోస్టు వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన శెట్టిమణి (40), శెట్టి సూర్య (25)గా గుర్తించారు. వారి నుంచి 362 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3.55 లక్షల నగదుతోపాటు నేరానికి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో గతనెల 30వ తేదీన శెట్టి లక్ష్మి, శెట్టి మీనాలను అరెస్టు చేసి రూ.6.37 లక్షల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఐదో నిందితుడైన శెట్టి విజయ్ పరారీలో ఉండగా మిగిలిన నలుగురూ భార్యాభర్తలు. కందుకూరు, రావులపాలెంలో శెట్టి మణి పలు చోరీలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించాడు. 2022లో తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఈరోడ్డులో దొంగతనాలకు పాల్పడిన ఘటనలో భార్యాభర్తలు నలుగురూ జైలుశిక్ష అనుభవించినట్లు డీఎస్పీ వెల్లడించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రమణకుమార్, సీఐ చిన్న గోవిందు

ఆర్టీసీ విద్యుత్తు బస్సుకు తప్పిన పెను ప్రమాదం



పంక్చర్ దుకాణంలో నట్లు బిగిస్తున్న సిబ్బంది

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ విద్యుత్తు బస్సుకు పెనుప్రమాదం తప్పింది. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కడప నుంచి తిరుపతికి మంగళవారం ఆర్టీసీ విద్యుత్తు బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. మార్గంమధ్యలో మాధవరం వద్దకు వెళ్లగానే బస్సు వెనకాల టైరు నట్లు లూజయ్యాయి. డ్రైవర్ గమనించకుండా అలానే వెళ్తున్నారు. అదే సమయానికి ఆ బస్సు పక్కన వెళ్తున్న కారులోని ప్రయాణికులు గుర్తించి, వెంటనే విషయాన్ని డ్రైవర్‌కు చెప్పారు. దీంతో రోడ్డు పక్కనే నిలిపివేయడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టైర్లు బాగున్నాయా, నట్లు బాగున్నాయా అని చూసుకోకుండా బస్సు ఎలా నడుపుతున్నావంటూ డ్రైవర్‌పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని టైరు పంక్చర్ దుకాణం వద్దకు బస్సును తీసుకెళ్లి నట్లను బిగించడంతో తిరిగి బయలుదేరింది. ఒక వేళ కారులోని ప్రయాణికులు గమనించకపోతే భారీ ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవించేది. ఈ విషయంపై ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డిని సంప్రదించగా శీతల విద్యుత్తు బస్సులకు కడపలో ఛార్జింగ్ మాత్రమే పెడతారని చెప్పారు. వాటి నిర్వహణ తిరుపతిలోని విద్యుత్తు బస్సుల ఏజెన్సీ వాళ్లు చూస్తారని, విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

తిరుపతి

● తిరుపతి ● చంద్రగిరి

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య : టి.నగర్‌లోని ఇంటి నంబరు 96//ఏ ఉన్న వీధి కుళాయిలో నగరపాలిక నీరు సక్రమంగా రావడం లేదు. రోజు మార్చి రోజు వదలడం, కొంతసేపు మాత్రమే వదులుతుండడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉంది. మరింత ఒత్తిడితో వదిలితే ఉపయోగంగా ఉంటుంది. **- టి.కె.శ్రీనివాసన్, టి.నగర్**

సమాధానం: టి.నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతాం.
- శ్యాంసుందర్, ఎస్ఈ, నగరపాలిక

సమస్య: తిరుపతి పోస్టల్‌కాలనీ నాలుగో క్రాస్ అలెక్సా హోమ్ స్టే ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ నుంచి వారం రోజులుగా మురుగు పొంగి వీధి మొత్తం పారుతోంది. **- సురేష్, పోస్టల్ కాలనీ**

సమాధానం: పోస్టల్ కాలనీలో మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరిస్తాం. **- డా.యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక**

మ్యాన్‌హోల్ సమస్యలకు పరిష్కారం

స్పందనకు వందనం

తిరుపతి (నగరపాలిక) , న్యూస్‌టుడే :మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తపై నగరపాలిక అధికారులు స్పందించారు. అలిపిరి పోలీస్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న రెండు మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించారు.

నిల్వ నీరు తొలగింపు : రామచంద్రాపురం: రాయలచెరువు శ్మశానవాటిక వద్ద మలుపులో వాన నీరు నిల్వ ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. నీరు నిల్వ లేకుండా పనులు చేశారు.

శ్రీనివాస సేతుపై మరమ్మతులు

ఈనాడు, తిరుపతి : శ్రీనివాస సేతుపై అధికారులు మరమ్మతులు చేపట్టారు. రామానుజ కూడలి వద్ద వలయాకారంలో తారు కొట్టుకుపోవడంతో ఇనుప ప్లేట్లు బయటికి వచ్చాయి. సమస్యపై 'మందుబాబులకు అడ్డాగా.. వేడుకలకు నిలయంగా' శీర్షికన ఈనెల 21న 'ఈనాడు'లో కథనం రావడంతో మరమ్మతులు చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

ఇంటి పట్టాల పరిశీలన

చిన్నగొట్టిగల్లు : భాకరాపేటలోని మోడల్ కాలనీ, జగనన్న కాలనీల్లో సర్వే నంబర్ 329, 341, 342, 368, 629, 630లలోని ఇంటి పట్టాదారులకు తహసీల్దారు జనార్దనరాజు నోటీసులు ఇచ్చారు. వైకాపా హయాంలో అక్రమంగా ఇళ్ల పట్టాలు ఇచ్చారు. దీనిపై సెప్టెంబర్ 22న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. నోటీసులు ఇచ్చి దస్త్రాలు పరిశీలించారు.

బదిలీల అప్పగింతలకు ససేమిరా..!

సహకరించని పంచాయతీ కార్యదర్శులు



తిరుమల నగర్‌లోని పంచాయతీ కార్యాలయం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: కొత్త స్థానాల్లో చేరినా పనిచేసే అవకాశం లేకుండా చేతులు కట్టేసినట్లుంది నూతన పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. సాధారణ బదిలీల్లో స్థానచలనం పొందిన కార్యదర్శులకు అప్పటివరకు విధులు నిర్వర్తించినవారు ఛార్జి ఇవ్వడంలో సహకరించకపోవడంతో క్షేత్రస్థాయిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా వైకాపా పాలనలో అడ్డగోలుగా వ్యవహరించిన కార్యదర్శులు కొందరు మొండిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో పన్ను వసూళ్లు, మార్పిడులు, అనుమతులు, ధ్రువపత్రాల జారీ వంటి సేవలకు అంతరాయం కలుగుతోంది.

ఇదీ సంగతి..

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పలు పంచాయతీలకు ఇటీవల కొత్తగా కార్యదర్శుల నియామకం జరిగింది. ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ, తిరుచానూరు, తిరుపతి గ్రామీణ మండలాల పరిధిలో వైకాపా పాలనలో కొందరు కార్యదర్శులు స్థానిక నాయకులతో అంటకాగుతూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే వారిపై చర్యలు తీసుకుంది. సాధారణ బదిలీల్లో వేరొకచోటికి పంపగా సదరు కార్యదర్శులు దస్త్రాలు అప్పగించకుండానే వెళ్లిపోయారు. కొత్తవారు రికార్డుల కోసం వెంటపడుతున్నా స్పందించడం లేదు. రేపూ మాపూ అంటూ వాయిదాలు వేస్తుండటంతో మండల స్థాయిలో అధికారులు సమావేశాలు నిర్వహించి మరీ చెప్పాల్సి వస్తోంది. రెండు రోజుల్లో రికార్డులు అప్పజెప్పకుంటే తాఖీదులు జారీ చేస్తామని, జీతాలు రాకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం గమనార్హం. ఇదే విషయమై తిరుపతి గ్రామీణ మండల ఎంపీడీవో రామచంద్ర స్పందిస్తూ బదిలీపై వెళ్లిన కార్యదర్శులు కొత్తగా చేరినవారికి ఛార్జి అప్పజెప్పాలని ఆదేశాలిచ్చామని, అవసరమైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్మికులకు న్యాయం చేయండి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే లగేజీ కేంద్రాల్లో 15 సంవత్సరాలుగా తక్కువ జీతంతో పనిచేస్తున్న 350 మంది తాత్కాలిక సిబ్బందికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఈవో శ్యామలరావుకు భాజపా నేత నవీన్ కుమార్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు. వారందరినీ శ్రీలక్ష్మి శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో విలీనం చేసి జీతాలు పెంచాలని కోరారు.

ఆధార్ కేంద్రాలకు విశేష స్పందన

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామీణ మండలంలోని పలు పంచాయతీల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలకు మంచి స్పందన వచ్చిందని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. దుర్గసముద్రం, సి.మల్లవరం, లింగేశ్వర్‌నగర్, బ్రాహ్మణపట్టు, శెట్టిపల్లిలో కేంద్రాలు ఏర్పాటు చేయగా 175 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బుధవారం ధనలక్ష్మీనగర్, వేదాంతపురం, పెరుమాళ్లపల్లి, పాడిపేట, రణధీర్‌పురంలో కేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు.

యువతపైనే దేశాభివృద్ధి, భవిష్యత్తు

తిరుపతి(రైల్వే): దేశాభివృద్ధి, భవిష్యత్తు నేటి యువతపై ఆధారపడి ఉందని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు నారాయణరెడ్డి, మంజుల అన్నారు. స్థానిక టీపీపీఎం పాఠశాలలో మంగళవారం ప్రజాసాధికారిత ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం చిత్తూరు సహకారంతో మాదకద్రవ్యాల వినియోగం, దుష్పరిణామాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సాధికారిక ట్రస్ట్ అధ్యక్షుడు బాలాజీ నాయక్, టీపీపీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ కుమార్, మహిళా కానిస్టేబుల్ శాంతి, ఉదయ్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు

లైసెన్సు లేని బాణసంచా దుకాణాలపై చర్యలు

పాకాల: దీపావళిని పురస్కరించుకుని బాణసంచా విక్రయించే దుకాణదారులు విధిగా లైసెన్సు కలిగిఉండాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని పాకాల అగ్నిమాపకశాఖ అధికారి గుణశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.

'సంగీత విభావరి అనుమతులు రద్దు చేయాలి'

తిరుపతి (బైరాగిపట్టెడ): ఈనెల 26న ఎస్వీయూలోని తారకరామ స్టేడియంలో జరిగే సంగీత విభావరికి వర్సిటీ అధికారులు అనుమతులు వెంటనే రద్దుచేయాలని ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులకు ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నేతలు అశోక్, వినోద్, నరేంద్ర, వీరేష్ పాల్గొన్నారు.

నిత్య చైతన్యంతో నైపుణ్యం





▸ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ▸ బహుమతులు అందుకున్న తరుణ్ కుమార్ రెడ్డి, అక్షిత్ రెడ్డి, షణ్ముఖప్రియ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: విద్యార్థులు నిత్య చైతన్యంతో ఎదగాలని, అనేక అంశాల్లో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని తెలుసుకుంటూ నైపుణ్యం పెంపొందించుకోవాలని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.ఆర్. అనూరాధ గోపాల్ అన్నారు. మంగళవారం కరకంబాడి మార్గంలోని ఆ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 8,9,10 తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీహెచ్ తరుణ్ కుమార్ రెడ్డి, బి.అక్షిత్ రెడ్డి, డి.షణ్ముఖ ప్రియ వరుసగా విజేతలుగా నిలిచారు. వారిని పాఠశాల అధినేత కె.ఎస్.వాసు అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు 'ఈనాడు' నుంచి బహుమతులు, ప్రశంశా పత్రాలను ప్రిన్స్‌పల్ కేఆర్ అనూరాధ గోపాల్, మేనేజర్ సాంబశివారెడ్డి అందజేశారు.

అర్హులకే ఇళ్ల స్థలాలు.. తెదేపా హయాంలో అర్హులైన వారికే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్ అన్నారు. మంగళవారం తెదేపా నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా హయాంలో భాకరాపేటలో అనర్హులకు ఇళ్ల పట్టాలిచ్చారని, అధికారులు విచారిస్తుండగా.. కూటమి నాయకులు ఆక్రమిస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. వైకాపా హయాంలో అక్రమాలన్నీ వెలికితీస్తామన్నారు.

వైద్యసేవలు అందించాలి.. చంద్రగిరి, న్యూస్‌టుడే: ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్యాధికారిణి డా.హరిత అన్నారు. దోర్నకంబాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులతో కలిసి తనిఖీ చేశారు. వైద్యులు శిరీష, ఎస్వో నాగేంద్రకుమార్, సూపర్‌వైజర్ సురేష్‌బాబు, డీపీవో ప్రకాష్ పాల్గొన్నారు.

వారం రోజులుగా మడుగులోనే రాకపోకలు



తిరుచానూరు వసుంధర నగర్ వద్ద గత వారం కురిసిన వర్షాలకు రహదారిలో వర్షంనీరు నిలిచింది. కాలువ ఏర్పాటు లేకపోవడంతో చెరువును తలపిస్తోంది. ద్విచక్రవాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులుపడుతున్నారు. రహదారిలోని గుంతలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

చంద్రగిరి, పాకాలలో కుండపోత

పాకాల, న్యూస్‌టుడే: పాకాల పరిసరాల్లో మంగళవారం సాయంత్రం అరగంటపాటు కుండపోతగా వర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రోడ్డుపైన దుకాణాల్లోకి నీరు చేరాయి. వాహనదారులు సైతం వాహనాలను పక్కన ఆపేయాల్సి వచ్చింది. పెద్దవంకలో నీటి ప్రవాహం పెరగడంతో ఆ నీటిని పాకాల పెద్ద చెరువుకు మళ్లించారు.

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం కుండపోతగా సుమారు రెండు గంటలపాటు వర్షం కురిసింది. విద్యుత్తుశాఖ అధికారులు సరఫరా నిలిపివేశారు. రాయలపురం పంచాయతీలోని వెంకటంపేట గ్రామంలో పలు గృహాల్లోకి వరదనీరు చేరింది.

కంచి పీఠాధిపతిని కలిసిన తితిదే ఈవో

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే ఈవో జె.శ్యామలరావు మంగళవారం సాయంత్రం కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారి ఆశీస్సులు పొందారు. తిరుపతిలోని వినాయక నగర్ వద్ద ఉన్న కంచి మఠాన్ని ఈవో సందర్శించారు. ధార్మిక కార్యక్రమాలపై స్వామివారు పలు సూచనలు చేసినట్లు తితిదే ఒక ప్రకటనలో పేర్కొంది.

విద్యాలతాదేవికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కాంచీపురానికి చెందిన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయం నుంచి హిందీ విభాగంలో పరిశోధక విద్యార్థి పోతూరి విద్యాలతాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కంద శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డా.బి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు వెల్లడించారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న డాక్టర్ పి.సి.రాయులు, భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా జన్మదినం పురస్కరించుకుని కస్తూర్బా గాంధీ ట్రస్ట్ ఛైర్మన్ డా.పి.సి.రాయులు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక గోవిందరాజస్వామి ఆలయ మాడవీధిలోని భాజపా కార్యాలయంలో సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.

IN THE COURT OF THE 1 ST ADDITIONAL JUNIOR CIVIL JUDGE: TIRUPATI
O.S.No. 286 of 2022

Canara Bank, M.R.Palle Branch-1, rep by its Senior Manager ...Plaintiff
Vs.
Sri Chaithanya Chandra paints rep by its proprietor K. Karthik ...Defendant

Suit summons to Defendant

Sri Chaithanya Chandra paints rep by its proprietor, K. Karthik S/o k. Venkateswar achari, D.No.1-22, UPstairs, Garudadri Nagar, Beside Balaji Dairy, Avilala, Tirupathi Rural Mandal, Chittoor District.

The Plaintiff filed the suit for recovery of amount Rs.1,69,289-00 against both of you (the defendants). The above case is posted to 06-11-2024 at 10-30 A.M. in the above court for your appearance and raise objections if any either in person or through your advocate otherwise the matter will be decided on the records available in the case.

Hearing Date: 06-11-2024
G.MADHUSUDHANAREDDY
Advocate for Plaintiff, Tirupati
Cell No: 09440934263.

పల్లె పండుగతో సుందర గ్రామాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తినాని

తిరుపతి (గ్రామీణ, మంగళం), న్యూస్‌టుడే: పల్లె పండుగతో గ్రామాలు సుందరంగా తయారవుతాయని ఎమ్మెల్యే పులివర్తినాని అన్నారు. తిరుమలనగర్ గ్రామ పంచాయతీ కొళ్లఫారాలలో ఉపాధిహామీ నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తిరుపతి గ్రామీణ మండలానికి కేటాయించిన రూ.3.96 కోట్లలో 60 శాతం నిధులు మంగళంలో అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించామన్నారు.

చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు పార్టీలకతీతంగా న్యాయం చేయాలని, ప్రతి బాధిత కుటుంబానికి ఇంటి స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. భూసేకరణపై చిత్తూరు జిల్లా జేసీ విద్యాధరితో చర్చించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన : రామచంద్రాపురం: ఎమ్మెల్యే పులివర్తి నాని మండలంలో బుధవారం మిట్టకండ్రిగ, కుప్పంబాదూరు, రాయలచెరువు, సి.కాళేపల్లి, నెత్తకుప్పం, వేపకుప్పం, అనుప్పల్లి పరిధిలో పర్యటించనున్నట్లు తెదేపా మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి ప్రకటనలో తెలిపారు.

భీష్మయ్య నాయుడు మృతికి నివాళి.. చంద్రగిరి గ్రామీణ: కందులవారిపల్లి పంచాయతీ శేషాపురం గ్రామానికి చెందిన టీటీడీ విశ్రాంత ఆరోగ్య పరిరక్షణాధికారి బొబ్బా భీష్మయ్య నాయుడు (70) మృతిచెందగా ఎమ్మెల్యే పులివర్తి నాని, ప్రముఖ సినీ హాస్యనటుడు రఘుబాబు తదితరులు నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

మఠం భూమిలో అక్రమ నిర్మాణాలపై ఘర్షణ

30 మందిపై కేసు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మఠం భూమిలో అక్రమ నిర్మాణాల విషయమై జరిగిన దాడి ఘటనలో 30 మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు. లింగేశ్వర నగర్‌లోని సర్వే నంబరు 145, 147-1, 148-2లో నవీన్ కుమార్ రెండు రోజులుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు పి.మురళిబాబు, అవిలాల శివప్రసాద్, సాయినగర్ కవిత, లింగేశ్వర నగర్ హేమలత అభ్యంతరం చెప్పారు. దీంతో నవీన్‌కుమార్‌కు సంబంధించిన రజని, అశోక్, సురేష్, శంకర తదితర 30 మంది రాడ్లు, కర్రలతో దాడికి దిగారు. అభ్యంతరం చెప్పిన నలుగురూ గాయపడ్డారు. రుయా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎర్ర చందనం స్వాధీనం

భాకరాపేట, న్యూస్‌టుడే : వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట అటవీశాఖాధికారి వెంకట్రమణ తెలిపారు. సోమవారం రాత్రి పులిగోనుపల్లి పరిసర ప్రాంతాల నుంచి కారులో ఎర్రచందనం తరలిస్తుండగా తమ సిబ్బంది కారును వెంబడించారని, కమ్మపల్లి వద్ద కారును ఆపి ఇద్దరు వ్యక్తులు పారిపోయారన్నారు. కారును స్వాధీనం చేసుకుని 181 కిలోలున్న ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.8లక్షలు ఉంటుందని తెలిపారు. ఎఫ్‌బీవోలు ప్రదీప్‌కుమార్, ప్రదీప్ చాంద్, రాజేష్‌కుమార్, నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

ఘనంగా అయోడిన్ దినోత్సవం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని గోవర్ధనపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అయోడిన్‌పై అవగాహన కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి, సుధీర్, దేవేంద్రకుమార్, సుబ్రహ్మణ్యం, ఓంకార్, చెంచురామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్ఎన్ కండ్రిగలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. మంగళవారం ఇక్కడ హోమియో రీసెర్చ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మందికి పరీక్షలు హోమియో మందులను పంపిణీ చేశారు. హోమియో వైద్యులు, నిర్వాహకులు, భాజపా నాయకులు వెంకటాద్రియాదవ్, బొబ్బిలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి సత్కారం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ సనా ఫిర్దోస్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సత్కరించారు. అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆమె తమదైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల మంగళవారం ఆమెను సత్కరించారు. 28వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి శ్రీకాళహస్తికి ఖ్యాతిని తీసుకురావాలని కోరారు.



షేక్ సనాఫిర్దోస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

దుకాణాలకు అవకాశం ఇవ్వం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను అన్నీ తప్పక పరిగణలోకి తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ వలయాధికారిణి లావణ్య స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనూ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయబోమన్నారు. 'వద్దంటే వినరే' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆమె ప్రస్తుతం పట్టణంలోని బలరాం థియేటర్ సమీపంలోను, రామసేతు అన్నక్యాంటీన్ వద్ద, పొన్నాలమ్మ ఆలయం, బంగారమ్మ ఆలయాలకు సమీపంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు.

స్వర్ణముఖి తీరంలో వ్యర్థాల తొలగింపు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామసేతు వంతెనల సమీపంలో స్వర్ణముఖి నదీ తీరంలో వ్యర్థాలను తొలగించారు. ఈ నెల 21వ తేదీన 'సూచికలున్నా శుభ్రత కరవు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పురపాలక సంఘ కమిషనర్ గిరికుమార్ ఆదేశాల మేరకు మంగళవారం పారిశుద్ధ్య సిబ్బంది రామసేతు వంతెనల వద్ద వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

పడకేస్తున్న ప్రజా రవాణా



రేణిగుంట బస్టాండ్‌లో నిలిచిన బస్సును నెడుతున్న ప్రయాణికులు (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: వైకాపా సర్కారు గత ఐదేళ్ల పాలనలో ఆర్టీసీపై శీతకన్ను వేయడంతో ప్రజా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొత్త ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయకపోగా, ఉన్నవాటిని లోపభూయిష్టంగా నిర్వహణ చేయడంతో అవి సైతం డొక్కుగా మారాయి. గంతల రహదార్ల కారణంగా అవి మరింత దెబ్బతిని తరచూ నడిరోడ్డుపై మొరాయిస్తున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకునే భక్తులతో పాటు రోజువారీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.



పగిలిన బస్సు అద్దం

గమ్యం చేరుస్తాయా..?

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో 102 బస్సులున్నాయి. వాటిలో 24 మెట్రో సర్వీసులు కాగా, 78 ఆర్డినరీ సర్వీసులు అందులో 11 అద్దె బస్సులు ఉన్నాయి. వీటిలో అధిక భాగం కాలం చెల్లిన బస్సులే. దానికి తోడు వైకాపా హయాంలో నిర్వహణ తీరు అత్యంత ఆధ్వానంగా తయారైంది. సింహభాగం శ్రీకాళహస్తి-తిరుపతి మధ్య నడుస్తున్న మెట్రో సర్వీసులే కావడం గమనార్హం. సకాలంలో గమ్యస్థానాలకు చేరుస్తాయనే నమ్మకం లేకుండా పోయింది. ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

మెకానిక్‌లు, పరికరాల కొరత

గత వైకాపా ప్రభుత్వం ఒక వ్యూహం ప్రకారం ఆర్టీసీని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని పలు కార్మిక సంఘాలు ఆరోపించాయి. మరమ్మతులకు గురవుతున్న బస్సులను బాగుచేసే మెకానిక్‌లు, ఇతర సిబ్బంది నియామకాలను గత ప్రభుత్వం నిలిపివేయడం గమనార్హం. శ్రీకాళహస్తి డిపోలో మెకానిక్‌లు, సిబ్బంది కొరత వేధిస్తోంది.

తరచూ మొరాయిస్తున్న బస్సులు

❖ శ్రీకాళహస్తి డిపోలో 102 బస్సులుండగా అందులో సుమారు 10 బస్సులకు ముందు భాగం అద్దాలు పూర్తి స్థాయిలో పగుళ్లు ఏర్పడగా, మరో 10 బస్సులకు పాక్షికంగా పగుళ్లు ఉన్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చోదకులు వాపోతున్నారు. వర్షం కురిసే సమయంలో వాహనాలు నడపడం మరింత క్లిష్టంగా ఉందంటున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

డిపోలో పరికరాల కొరత ఉన్నమాట వాస్తవమే. ప్రతిపాదనలు పంపించాం. త్వరలో సమస్యలను పరిష్కరిస్తాం. బస్సులకు ముందు భాగం అద్దాలు పగుళ్లు ఉంటే వెంటనే మార్పు చేస్తాం. ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

- బాలాజీ, ఇన్‌ఛార్జి డిపో మేనేజర్, శ్రీకాళహస్తి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: నాగలాపురం పీహెచ్‌సీ ఆవరణలో ఆనుకుని రహదారిపైనే చెత్తా చెదారాలు ఉంటున్నాయి. ఇక్కడ చెత్తకుండీ ఉన్నా ఫలితం అంతంత మాత్రంగానే ఉంది. నిత్యం ముక్కు మూసుకుని రోగులు, పాదచారులు దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. **- పవిత్ర, నాగలాపురం**

సమాధానం: రెండు రోజుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్, సున్నంలను పిచికారీ చేయిస్తాను.

- చిన్నదురైసుధ, సర్పంచి, నాగలాపురం

న్యూస్‌టుడే, సత్యవేడు

సమస్య: మండల కేంద్రంలోని నేతాజీ రోడ్డు శ్రీవేంకటేశ్వర దేవాలయంవద్ద రహదారికి ఇరువైపులా కాలువ గోతులు ఏర్పడడంతో ద్విచక్రవాహన దారులు, పాదచారులు, ఆటోలు, సైక్లిస్టులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. **- బండారు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు**

సమాధానం: కాలువకు సంబంధించి నివేదిక ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

- ఇజ్రాయిల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సత్యవేడు

బోరు మోటారు బాగు

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని చిత్తూరు కండ్రిగ ఏఎడబ్ల్యూలో మరమ్మతుకు గురైన బోరు మోటారును బాగు చేశారు. మోటారు పాడవడంతో తాగునీటికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై సోమవారం మేమున్నాం మీకు తోడుగాలో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచి మురళి మంగళవారం బోరు మోటారును బాగు చేయించి తాగు నీటి సమస్యను పరిష్కరించారు.



ముఖ్యమంత్రికి విరాళం అందిస్తున్న మండల తెదేపా అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి

ముఖ్యమంత్రికి మండల తెదేపా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి విరాళం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంగళవారం మండల తెదేపా అధ్యక్షులు పి.యుగంధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరద బాధితులకు సాయంగా మండలం తరపున రూ.లక్ష విరాళంగా అందించారు. మానవత్వంతో స్పందించి సాయం చేసిన యుగంధర్‌రెడ్డిని చంద్రబాబునాయుడు అభినందించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రబాబు కోరినట్లు తెలిపారు. ఆయన వెంట సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన పెరగాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మత్తుపదార్థాల వాడకం కారణంగా తలెత్తే అనర్థాలు, పడే శిక్షలు, భవిష్యత్తు బుగ్గిపాలు కావడం తదితర వాటిపై యువతకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో మంగళవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులతో మాట్లాడుతూ ప్రధానంగా గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదాన్ని మోపాలని సూచనలు చేశారు. మహిళలకు రక్షణకు విఘాతం కల్గగుండా చూడాలన్నారు. ప్రజల నుంచి అభ్యర్థనలను ఆయన పరిశీలించారు. సన్నిధివీధిలో భక్తుల సౌకర్యార్థం రూ.37 లక్షలు వ్యయంతో సన్నిధివీధిలో, రూ.18 లక్షలతో టూరిస్టుబస్టాండ్ ఆవరణలో నిర్మించిన టాయ్‌లెట్స్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయ ఈవో బుధవారం ప్రారంభించే విధంగా సన్నాహాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఒక రోజు ముందుగానే ఎమ్మెల్యే వీటిని అందుబాటులోకి తీసుకురావడం విశేషం. ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈవో లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, ఏఈ కిషోర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

జీవామృతంతో ఆరోగ్యకర పంటలు

సత్యవేడు: ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా దేశీయ గోవుల వ్యర్థాలతో తయారు చేసే జీవామృతంతో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని మండల వ్యవసాయాధికారి మురళి స్పష్టం చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రాజగోపాలపురంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి మధు, రూపేష్, వీఏఏ మదన్‌మోహన్, రైతులు పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీలో పాల్గొన్న బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, ఉపాధ్యాయులు

పోటీ.. వ్యాసరచనలో మేటి

'ఈనాడు' ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా మంగళవారం 'ఇంటర్‌నెట్ వాడకం వల్ల లాభాలు-నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు కేతన్‌రెడ్డి, ముని సందీప్, లిఖితలు తమదైన ప్రతిభను కనబరిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాలస్వామి, గోపి, దాము, కుమార్, సుధాకర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

కన్పించని గుంత.. తప్పని చింత



మిట్టకండ్రిగ నుంచి అమ్మపాళెం మీదుగా వెళ్తున్న ఆర్అండ్‌బీ రహదారి ఆద్యంతం ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా మిట్టకండ్రిగ సమీపంలో రోడ్డు పొడవునా గుంతలు ఉండటం, వర్షం పడితే నీళ్లన్నీ నిల్వ చేరడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. గుంతలు తెలియక పలువురు వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఇక్కడ నీటి నిల్వలు లేకుండా చేయడంతో పాటు గుంతల పూడ్చే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

ఎంపీడీవో భవనం భయం.. భయం



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం లోపల భాగం అక్కడక్కడా పెచ్చులూడి పోవడంతో అధికారులు బిక్కబిక్కమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వ భవనాలకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో ఈ దుర్భర స్థితి ఏర్పడింది. కార్యాలయానికి రావడానికి ప్రజలు భయపడుతున్నారు. వర్షం వస్తే భవనం లీకేజీ అవుతోంది. భవనానికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా భవనంలో పెచ్చులూడిన వద్ద పనులు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

పట్టించుకుంటే ఒట్టు



శ్రీకాళహస్తి మండలంలోని కుంటిపూడి పంచాయతీ కొత్తూరులో మంచినీటి ట్యాంకు నిరుపయోగంగా దర్శనమిస్తోంది. స్థానికులకు మంచినీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో గత ఐదేళ్ల కిందట ప్రభుత్వం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించింది. ఏళ్లు గడుస్తున్నా మంచినీటి ట్యాంకు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకును అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో పఠాన్ రఫీఖాన్‌ను వివరణ కోరగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తిగ్రామీణం (ఏర్పేడు)**

అలా తవ్వి ఇలా వదిలేశారు



గ్యాస్ పైపులైను ఏర్పాటులో భాగంగా గుత్తేదారులు శ్రీకాళహస్తి-పంగూరు ప్రధాన రహదారి వెంబడి కాలువ తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించే వాహనాలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయి. రహదారి వెంబడి పెద్దఎత్తున పరిశ్రమలు సైతం ఉండటంతో ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను బయట ప్రాంతాలకు తరలించే సమయంలో భారీ వాహనాలు రహదారిపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై రోడ్డుభవనాల శాఖ ఏఈ ప్రమీళను వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

భూ ఆక్రమణను అడ్డుకున్నందుకు దాడి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: గ్రామస్థులందరూ దైవకార్యాలకు వినియోగించుకుంటున్న కచేరి స్థల ఆక్రమణను అడ్డుకున్నందుకు వీఆర్ఏ, అతని కుమారుడు దాడి చేయడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాండూరులో గ్రామస్థులందరూ దైవకార్యాలకు వినియోగించుకుంటున్న కచేరి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వీఆర్ఏ చెంచయ్య గతంలో ఆక్రమించగా గ్రామస్థులు తహసీల్దారునకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆ స్థలాన్ని ప్రభుత్వస్థలంగా గుర్తించి హద్దులు గుర్తించారు. సోమవారం వీఆర్ఏ చెంచయ్య, అతని కుమారుడు చెంచుబాబులు కచేరి స్థలంలో వేసిన సర్వేహద్దురాళ్లను తొలగించి ఆక్రమించేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆక్రమణను అడ్డుకుని తొలగించిన సర్వేరాళ్లను యథాక్రమంలో నాటి ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఆక్రమణను అడ్డుకున్నారనే కారణంతో దీనికి ప్రధాన కారణమైన చిట్టేటి చెంగల్‌రాయులు సాయంత్రం వేళ ఇంటికి వెళుతున్న సమయంలో చెంచయ్య, అతని కుమారుడు చెంచుబాబుతోపాటు అతనికి మద్దతుగా సురేష్, సుధాకర్ కర్రతో దాడి చేయగా, ఈ దాడిని చూసి అడ్డుకోవడానికి వచ్చిన చిట్టత్తూరు బత్తెయ్యపైనా దాడిచేసి గాయ పరిచారు. బాధితుల కథనం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



హీరో కంపెనీని తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

భద్రతా ప్రమాణాలపై అధికారుల పరిశీలన

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హీరో మోటార్స్ పరిశ్రమలో భద్రతాప్రమాణాలపై ఉన్నతాధికారుల బృందం మంగళవారం తనిఖీ చేశారు. కంపెనీల భద్రతప్రమాణాల విభాగం ఛైర్‌పర్సన్ వసుంధర మిశ్రా(విశ్రాంత ఐఏఎస్ అధికారి) నేతృత్వంలో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్ డి.ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధికారుల బృందం హీరో కంపెనీలో కార్మికుల రక్షణకు నిర్వహిస్తున్న భద్రతాచర్యలు, ఇతర ఏర్పాట్లను నేరుగా పరిశీలించారు. హీరో కంపెనీ యాజమాన్య ప్రతినిధులు నిహాల్ కౌర్, మనోహర చక్రవర్తి, అనూప్ గుప్తాతోపాటు, సెక్యూరిటీ చీఫ్ అధికారి కిరణ్ కంపెనీలో తీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు, అనుసరిస్తున్న విధానాల గురించి వివరించారు. భద్రతాప్రమాణాలపై అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు..!

☛ సాంస్కృతికోత్సవాలకు సన్నాహాలు
☛ భక్తులందరికీ ప్రయోజనమే



విశ్రాంతి కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాటు చేసిన వేదిక

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎట్టకేలకు వేదిక సిద్ధమైంది. ఇన్నాళ్లపాటు మందుబాబులు సేద తీరడం, వాళ్లను చూసి భక్తులకు అక్కడకు రావాలంటే భయపడిపోయే పరిస్థితి. అలాంటి విశ్రాంతి కేంద్రం ఎట్టకేలకు సాంస్కృతికోత్సవాలకు కేంద్రం కానుంది. రానున్న కార్తిక మాసం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలన్నీ ఇక్కడి వేదికపై జరిగేలా అధికారులు సన్నాహాలు సిద్ధం చేస్తుండటం గమనార్హం.

భక్తుల సౌకర్యం లక్ష్యంగా..: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు రూ.35 లక్షల వ్యయంతో భక్తులు విశ్రాంతి కోసం షెడ్డును ఏర్పాటు చేశారు. అయితే దర్శనం అయిన భక్తులు తిరుగు ప్రయాణం అయ్యేంత వరకు, రాత్రి వేళల్లో రైళ్లకు వెళ్లే భక్తులు ఇక్కడి విశ్రాంతి కేంద్రంలో సేద తీరుతూ వచ్చారు. అయితే వసతులన్నీ బాగుండటంతో మందుబాబులు మకాం వేశారు. దీంతో వాళ్లకు భయపడి భక్తులు రావడం మానేశారు. నూతన ఈవో చంద్రశేఖర్ ఆజాద్ బాధ్యతలు చేపట్టాక ఇక్కడున్న విశ్రాంతి కేంద్రం చుట్టూ షెడ్డు ఏర్పాటు చేయించారు. బస చేసే భక్తులు విధిగా ఆధార్‌కార్డుతో వివరాలు నమోదు చేసుకుని ఉచితంగా బస చేయడం, మందుబాబులు వచ్చేందుకు వీల్లేకుండా భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయించడంతో మళ్లీ ఇక్కడి విశ్రాంతి కేంద్రం భక్తులకు వసతిగా మారింది. ఇక్కడకు సమీపంలోనే టాయ్‌లెట్స్, స్నానపు గదులు అన్నీ అందుబాటులో ఉండటంతో ఇక్కడి కేంద్రం భక్తులకు ఎంతో ప్రయోజకరంగా మారింది.

సాంస్కృతికోత్సవాలకు సన్నాహాలు: రానున్న కార్తిక మాసం సందర్భంగా ఇదే విశ్రాంతి కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ వేదిక ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. కళాకారుల కోసం గ్రీన్‌రూములు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమాలు వీక్షించేందుకు అనుకూలంగా అభివృద్ధి పరుస్తున్నారు.

తారకరామానగర్‌లో చెట్ల కొమ్మల నరికివేత

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని తారకరామానగర్‌లో ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చెట్టు కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఇటీవలే ఇక్కడ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని స్థానికులు కలిసి తమ సమస్యలను వివరించారు. వెంటనే స్థానికులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించడంతో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు

వరదయ్యపాళెం: వరిలో కాలిబాటలను ప్రతి రెండు మీటర్లకు 20సెం.మీ చొప్పున ఏర్పాటు చేసుకుని, నారు కొనలు తుంచి నాటుకోవడం ద్వారా ఆకుముడత తెగళ్ల నుంచి రక్షణ పొందవచ్చని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని కడూరు, అరుదూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరిలో సాగుయజమాన్య పద్ధతులను గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ద్వారకానాథ్, విస్తరణాధికారి ప్రవీణ్, వ్యవసాయశాఖ సిబ్బంది మౌళి, నాగభూషణం పాల్గొన్నారు.

రాగితీగల చోరీ

ఏర్పేడు, న్యూస్‌టుడే: వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగితీగలు చోరీచేసిన ఘటనపై ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 18వ తేదీన పల్లం, చింతలపాళెం, దుర్గిపేరి ఏర్పేడు, సరస్వతికండ్రిగ, మేర్లపాక పంచాయతీల్లోని వ్యవసాయ పొలాల్లో 13 ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రూ.65వేలు విలువైన రాగితీగలను అపహరించుకుని వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినుత కోటాపై కేసు కొట్టివేత

రేణిగుంట, న్యూస్‌టుడే: జనసేన శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి వినుత కోటా, ఆమె భర్త చంద్రబాబుపై గత వైకాపా ప్రభుత్వంలో పెట్టిన కేసును చిత్తూరు కోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా వినుత కోటా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రోద్బలంతో పోలీసులు తమపై తప్పుడు కేసులు నమోద చేశారని తెలిపారు. నిరూపణ కాకపోవడంతో మంగళవారం చిత్తూరు కోర్టు కొట్టివేసిందని తెలిపారు. తమను ధైర్యంగా ఎదుర్కోలేక తమపై తప్పుడు కేసులు నమోదు చేసి తమ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టి రాక్షస ఆనందం పొందిన ప్రతి ఒక్కరికీ చట్టపరంగా శిక్షపడేలా చేస్తామని తెలిపారు.

ఇడ్లీ తినాలంటే పిండి మోయాల్సిందే



పిండి మోసుకెళుతున్న విద్యార్థులు

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: బడికి వెళ్లి చవుదుకోవాల్సిన విద్యార్థులు కూలీలుగా మారుతున్నారు. మంగళవారం మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు వీధుల్లో పిండి బక్కెట్లు మోసుకెళ్తూ కనిపించారు. విద్యార్థులు ఉదయం అల్పాహారంగా ఇడ్లీ తినాలంటే టౌనుకు వెళ్లి పిండి రుబ్బించుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వసతి గృహానికి కావాల్సిన వస్తువులు తీసుకువచ్చే పనులు సహాయక సిబ్బంది చేయకుండా విద్యార్థులచే చేయిస్తున్నారు. వసతిగృహ సంరక్షకులు స్థానికంగా కాపురముండకుండా, విధులకు సక్రమంగా హాజరు కాక పోవడంతో విద్యార్థులకు పాఠ్యాంశాలలో సందేహాలు వస్తే, నివృత్తి చేసేవారుకూడా లేరు. దీంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వార్డెన్ సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు... రేణిగుంట పంచాయతీ బాలాజీ నగర్‌కు చెందిన ఖాసింబీ(65) సోమవారం రాత్రి సీబీఐడీ కాలనీ రోడ్డు దాటుతున్న సమయంలో యువకులు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. గాజులమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలస కార్మికుడి మృతి కేసులో నిందితుడి అరెస్టు

శ్రీసిటీ, వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: చిన్నాన్నపై అన్న కొడుకు దాడి చేయడంతో మృతి చెందిన కేసులో నిందితుడు విక్రమ్ ముర్మును అరెస్టు చేసినట్లు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. సీఐ బీవీ శ్రీనివాసుల కథనం మేరకు.. శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం బాద్వా ప్రాంతానికి చెందిన వలస కార్మికులు చిన్నాన్న అయిన సికారిముర్మపై అతని అన్న కొడుకు విక్రమ్ ముర్మ తల్లిని అసభ్యంగా మాట్లాడాడనే కోపంతో దాడి చేయడంతో సికారిముర్మ అక్కడి కక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన శ్రీసిటీ పోలీసులు పరారీలో ఉన్న నిందితుడు విక్రమ్‌ముర్మను మంగళవారం అరెస్టు చేసినట్లు తెలిపారు.

గూడూరు
• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 30 నుంచి రూ. 50 వరకు
రెండో రకం: కిలో రూ. 20 నుంచి రూ. 30 వరకు



సుబ్రహ్మణేశ్వరస్వామికి ప్రత్యేకాలంకరణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆత్మా మాలిక్ ధ్యాన మందిరంలో సుబ్రహ్మణేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరంలో మూలవిరాట్‌కు చేసిన విభూది అలంకరణ భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5.30 లక్షలను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం అందజేశారు. నియోజకవర్గానికి చెందిన తాతంశెట్టి బుజ్జమ్మ, అల్లం దీపిక, మనుబోలు ధనమ్మ, బల్లి రాజారత్నం ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. వారికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు ఎ.రమేష్, కిషోర్, శంకరయ్య, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	132
లేయర్	115
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	195

రూ.కోట్లు.. లక్ష్యానికి తూట్లు

☛ చేసిన పనులే మళ్లీ చేస్తూ.. ☛ చోద్యం చూస్తున్న యంత్రాంగం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పేదలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం' నిధులు పక్కదారి పడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపంతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగమవుతున్నాయి. చేసిన చోటే మళ్లీ పనులు చేస్తున్నారు.

బాలాయపల్లి మండలంలో ఉపాధి నిధులతో చేసిన పనులు పరిశీలిస్తే.. ప్రభుత్వ నిధులను ఏ స్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారనేది అంతుచిక్కని పరిస్థితి. 2023-24లో రూ.14 కోట్లకు పైగా ఉపాధి నిధులు వెచ్చించి కూలీలతో పనులు చేసినట్లు దస్త్రాలు చెబుతున్నాయి. ఎక్కువ భాగం ఊట చెరువు పనులు చేశారు. ప్రభుత్వ భూములు గుర్తించి ఎగువ వచ్చే వాన నీటిని నిల్వ చేసుకునేలా ఈ చెరువులను ప్రణాళికలతో పూర్తి చేయాలి. అవేవీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా పనులు చేశారనడానికి ఈ చెరువులే నిదర్శనం. జలవనరుల శాఖ పరిధిలోని చెరువుల్లోనే గుంతలు తవ్వి మట్టి కట్టలు వేసి ఊట చెరువులుగా చూపి నిధులు దుర్వినియోగం చేశారు.



నిండలి చెరువుకు పడమటి దిక్కులో మరో ఊట చెరువు

ఎక్కడెక్కడంటే..

❖ నిండలిలోని ఓ చెరువులో పదుల సంఖ్యలో ఊట చెరువులు నిర్మించారు. అవన్నీ వర్షాలకు చెరువు నిండినప్పుడు జలమయం అవుతున్నాయి. మరో వైపు ఆయా గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు నీటిని నిల్వ చేసే చెరువుల దగ్గర 'ఊట చెరువు' పేరుతో గుంతలు తీశారు. వీటి వల్ల ఆ చెరువుల్లో నీటి నిల్వల సామర్థ్యం తగ్గే ప్రమాదం లేకపోలేదు. ❖ పెరిమిడి పంచాయతీలోని అడవుల్లో పలు చోట్ల ఊట చెరువులు తవ్వినట్లు దస్త్రాలు ఉన్నాయి. ఒక్కో చెరువుకు రూ.3 నుంచి 5లక్షలు వెచ్చించారు. కానీ ఈ చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి లేదు.

అటకెక్కిన సామాజిక తనిఖీలు

ప్రతి సంవత్సరం చేసిన పనుల్లో అవకతవకలు గుర్తించేందుకు సామాజిక తనిఖీలు నిర్వహించడం ఉండేది. తెదేపా పాలనలో ఓ సంవత్సరం సామాజిక తనిఖీల ఫలితం 18 మంది క్షేత్ర సహాయకులు, పలువురు సాంకేతిక సహాయకులు, ఏపీఎం వంటి వారిపై సస్పెన్షన్ వేటు పడిన సందర్భాలున్నాయి. వైకాపా పాలనలో మాత్రం ఈ తనిఖీలు నామమాత్రమైపోగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.14 నుంచి 15 కోట్లతో చేసిన పనులకు తనిఖీలు చేయని పరిస్థితి. మరో వైపు 2024-25 ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో మూడింట రెండో వంతు అంటే రూ.10కోట్ల వరకు ఖర్చు చేశారు. మొత్తం రూ25 కోట్లతో చేసిన పనుల్లో సామాజిక తనిఖీలు లేకపోతే అవకతవకలు నిగ్గు తేల్చడం కష్టం.



నిండలి చెరువులోనే.. ఊట చెరువు

రూ.10 కోట్లతో.. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.9.78 కోట్లు కూలీల రూపంలో ఖర్చు చేసినట్లు తాజా లెక్కలు ఉన్నాయి. అగ్రభాగం ఊట చెరువుల పేరుతోనే సొమ్ము దుర్వినియోగం అయినట్లు పనులు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే బాలాయపల్లి మండలం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిధులు ఖర్చు చేసిన జాబితాల్లో ఉంది. ప్రజలకు ప్రయోజనకర పనులు చేశారంటే అదీ లేదు. గతంలో చేసిన ఊట చెరువుల్లోనే పనులు చేయడం పరిపాటిగా తయారైంది.

భూగర్భజలాలు పెంచేందుకు కృషి చేస్తాం

వ్యవసాయ పొలాల్లో పంట కాలువలు, చెరువుల బాగుకు ఉపాధి నిధులు వెచ్చించడానికి ప్రాధాన్యత ఇస్తాం. అడవుల్లో, జలవనరుల చెరువుల్లో ఊట చెరువులు నిర్మించడం సరికాదు. ప్రభుత్వ భూములు గుర్తించి భూగర్భజలాలు పెంపొందించేందుకు ఊట చెరువులు తవ్విస్తాం. - వినీల్‌కుమార్, ఎంపీడీవో బాలాయపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే

సమస్య: కోట మండలంలోని ఉత్తమనెల్లూరు మలుపు వద్ద ర.భ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. వాహనాలు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలి.
- చెంచురాఘువరెడ్డి, కర్లపూడి

సమాధానం: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. **- యోహాన్, ఏఈ**

డక్కిలి, న్యూస్‌టుడే;

సమస్య: మండల కేంద్రంలోని బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో స్థానికులు చెత్తాచెదారం వేస్తున్నారు.
- శ్రీను, స్థానికుడు

సమాధానం: సమస్య పరిష్కారాని మార్గాలు తీసుకుంటాం. **- కృష్ణ చైతన్య, పంచాయతీ కార్యదర్శి**

డక్కిలి, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని నరసనాయుడు పల్లి హరిజనవాడలో మూడు రోజుల నుంచి నీటి సమస్య వేధిస్తోంది.
- దాసరి మాధవి, గ్రామస్థురాలు

సమాధానం: సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తాం.
- కృష్ణ చైతన్య, కార్యదర్శి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తలు అవసరం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు రెండో పట్టణం సాయి ఉపాధ్యాయ నగర్‌లోని జీవీఎస్ శంకరయ్య మెమోరియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం 'ప్రతిభా పాటవ' పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల కలిగే లాభ, నష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సయ్యద్ కరీమా, ఎస్.వెంకటేష్, కేవీ దినేష్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పవన్‌కుమార్, ప్రిన్సిపల్ రాము, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న విజయశ్రీ, నెలవల

కూటమితోనే యువతకు ఉద్యోగాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం యువత ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. జాబ్‌మేళాలో 25 బహుళ జాతి కంపెనీలు ఎంపికలు నిర్వహించాయి. ఉద్యోగాలకు అర్హత సాధించిన వారికి ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏఆర్ కిషోర్, శంకరయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కె.ధర్మప్రసాద్ పట్ల ఎస్సై బ్రహ్మనాయుడు అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడి, అవమానించారని పేర్కొంటూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఎస్సైను విధుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. **నాయుడుపేట, న్యూస్‌టుడే:** సూళ్లూరుపేటకు చెందిన న్యాయవాది కె.ధర్మప్రసాద్ పట్ల దురుసుగా వ్యవహరించిన ఎస్సై బ్రహ్మనాయుడిపై చర్యలు తీసుకోవాలని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని న్యాయవాదులు మంగళవారం డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు భవనం ముందు నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు పార్థసారథిరెడ్డి, పసల గంగాప్రసాద్, చదవల కుమార్, ఆశ చెంచుకృష్ణయ్య, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కృష్ణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: చిట్టమూరు మండలం కోగిలిలోని రొయ్యలగుంటలో పని చేస్తున్న కృష్ణయ్య, గుంటల యజమాని రెహమాన్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని కృష్ణయ్య మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. గూడూరులోని నరసింగరావుపేటలోని కృష్ణయ్య కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు.



విజేతను అభినందిస్తున్న పీడీ భరత్‌మహీపతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: చిట్టమూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దారావాసు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని మీనాకుమారి, పీడీ భరత్‌మహీపతి తెలిపారు. ఈ సందర్భంగా విజేతను మంగళవారం అభినందించారు. నవంబరు 5న విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టులో పాల్గొంటున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కోట, న్యూస్‌టుడే: కోట మండలం చంద్రశేఖరపురంలో మంగళవారం 'పల్లె పండుగ'లో భాగంగా 4.80లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి తెదేపా మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. **చిట్టమూరు(కోట):** చిట్టమూరు మండలం యాకసిరి, యాల్లసిరి, కోగిలి వడ్డికండ్రిగలో మంగళవారం సిమెంట్ రోడ్ల నిర్మాణానికి తెదేపా అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు భూమిపూజ చేశారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి మున్సిపాలిటీలో రెండో విడత ప్రారంభించాల్సిన అన్న క్యాంటీన్‌ను.. పోలేరమ్మ జాతర చాటింపు ప్రక్రియతో వాయిదా వేశారు. ప్రభుత్వం నిర్ణయంతో ప్రారంభానికి బుధవారం అన్నక్యాంటీన్ సిద్ధమైంది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ క్యాంటీన్ కోసం శాశ్వత భవన నిర్మాణం చేపట్టారు. ప్రత్యేక కౌంటర్లతో క్యాంటీన్ రూపుదిద్దుకుంది.



అయ్యప్పస్వామి నగరోత్సవం

వెంకటగిరి, న్యూస్‌టుడే: మల్లమ్మగుడి వీధిలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని పులి వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు.

చదువుల ఒడి.. నేడు కళ చెదిరి

రూ.20 లక్షలు వెచ్చించినా ప్రయోజనం శూన్యం



పాఠశాల ముందు ప్రవహిస్తున్న మురుగు దాటుతున్న విద్యార్థినులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: చదువుల తల్లి ఒడిలో హాయిగా సేదతీరాల్సిన విద్యార్థినులకు మురుగు, చెత్త నిల్వల కష్టాలు తప్పడం లేదు. ఏకాగ్రతతో పాఠాలు వినాల్సిన బాలికలు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాల దుర్గంధంతో అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితి వెంకటగిరి రాజావీధిలోని బాలికోన్నత పాఠశాలలో నెలకొంది. ఇక్కడ దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలకు ముందు భాగంలో ప్రవహిస్తున్న కాలువలో వ్యర్థాలు, చెత్త చెదారం పేరుకుపోవడంతో పాఠశాల అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది.

పట్టించుకునేవారు కరవు

ప్రధానంగా రాజావీధిలో వ్యాపార కేంద్రాలు, నివాస గృహాలు అధికంగా ఉన్నాయి. వాటి నుంచి వచ్చే మురుగు నీరంతా కాలువ గుండా ప్రవహించి కైవల్యనదిలోకి చేరుతుంది. అయితే అక్కడక్కడ కాలువలు ఆక్రమణలకు గురి కావడంతో మురుగు సాఫీగా వెళ్లేందుకు వీలు లేక ఇలా రోడ్డెక్కి పారుతోంది. పాఠశాల సమీపంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట కూడా మురుగు ప్రవహిస్తోంది. మరోవైపు పాఠశాలలోనే బాలికల వసతి గృహం ఉండటంతో దుర్వాసన, దోమల బెడదతో విద్యార్థినులు నిత్యం నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి నెల రోజులుగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. విద్యార్థినులు నిత్యం ఈ మురుగునీటి తొక్కుకుంటూ వెళ్లడమే కాక దాటే క్రమంలో అదుపు తప్పి కిందపడిన ఘటనలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ఆక్రమణలతో అవస్థలు.. పట్టణంలో వీధుల్లోని కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. జాతర సమయంలో తొలగించినా పరిస్థితి మళ్లీ యథావిధిగా మారింది. కాలువలపై బండలు వేసి ఆక్రమించడంతో శుభ్రం చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నిల్వ ఉంటోంది.



జడ్పీ పాఠశాల ముందు పేరుకుపోయిన చెత్త

తూతూ మంత్రంగా పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురపాలక కాలువల్లో వ్యర్థాలు తొలగించేందుకు రూ.35 లక్షలు కేటాయించారు. ఇందులో కాలువల శుభ్రతకు రూ.20 లక్షలు, కాలువలో ఉన్న తాగునీటి పైపులు తొలగించేందుకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. గత నెల పోలేరమ్మ జాతర సందర్భంగా ప్రధానమైన పెద్ద కాలువలో వ్యర్థాలు, చెత్త నిల్వలు తొలగించి మమ అనిపించారు.. 25 వార్డుల పరిధిలోని కాలువల్లో తూతూ మంత్రంగా పనులు చేశారు తప్పితే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. ప్రధాన వీధులైన రాజావీధి, తూర్పు వీధి, ఉత్తరం, దక్షిణపు వీధులే కాకుండా మార్కెట్ వీధి, బజారువీధి ఇతర ప్రాంతాల్లోని కాలువల శుభ్రత మరిచారు.

అధికారుల దాడులు

కోట, న్యూస్‌టుడే: కోట, విద్యానగర్‌లో తూనికల శాఖ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, సిబ్బంది మంగళవారం తనిఖీలు చేశారు. కాలపరిమితిలోగా కాటాలు సరి చేసుకుని ధ్రువపత్రాలు పొందాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్

పంట మార్పిడితో లాభాలు

కోట, న్యూస్‌టుడే: అన్నదాతలు పంటల మార్పిడి విధానంతో అధిక లాభాలు పొందవచ్చని కోట మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ తెలిపారు. పుచ్చలపల్లి, అల్లంపాడు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. శుద్ధి చేసిన విత్తనాలు నాటాలన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న దశరథరామిరెడ్డికి తమిళనాడులోని వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దశరథరామిరెడ్డి 'అనాలసిస్ ఆఫ్ ఫెడరేటెడ్ లెర్నింగ్' అనే అంశంపై పరిశోధనలు చేయడంతో డాక్టరేట్‌ను పొందారన్నారు.



దశరథరామిరెడ్డిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

వ్యక్తి మృతిపై విచారణ

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: చిట్టమూరు మండలం కోగిలి సమీపంలోని రొయ్యలగుంటల వద్ద పని చేసే చెంచుకృష్ణయ్య(30) అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై చినబలరామయ్య కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టారు. గూడూరులోని నరసింగరావేపేటకు చెందిన చెంచుకృష్ణయ్య జీవనోపాధి నిమిత్తం కోగిలిలోని రేహమాన్ రొయ్యలగుంట వద్ద కుటుంబంతో కలిసి పని చేస్తున్నారు. కృష్ణయ్య సోమవారం మృతి చెందారని మృతికి కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని గూడూరులోని నరసింగరావుపేటకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఆలస్యంగా అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. రొయ్యలగుంట యాజమాని వేధింపుల వల్లే చెంచుకృష్ణయ్య ఆత్మహత్య చేసుకున్నారని పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ జన్మదిన వేడుకలను తెదేపా నేతలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. పలువురు నేతలు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఎ.రమేష్, కిషోర్, పెరుమాళ్, శంకరయ్య పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యలు పరిష్కారం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రీ సర్వేలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఐవో ప్రసాద్ తెలిపారు. కొమ్మనేటూరులో గ్రామ సభను వీఆర్వో శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్, రీ సర్వే డీటీ చైతన్య, మండల సర్వేయర్ విశ్వనాథ్, గ్రామ సర్వేయర్ హరీష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **తడ:** పల్లిపాళెం, వెలగలవాగు గ్రామాలకు సంబంధించి రీసర్వేలో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహించిన గ్రామసభకు పలు వినతులు అందాయి. తహసీల్దారు శరత్‌బాబు, డివిజన్ సర్వేయరు శ్రీరాములు, వీఆర్వో బాబు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఉచిత అన్నదానం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో అన్నక్యాంటీన్‌లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పుట్టినరోజు సందర్భంగా కొనేటి రాజుపాళెంకు చెందిన తెలుగు యువత నాయకులు ముప్పాళ్లరాజ, తేజ, బాలు మంగళవారం ఉచిత అన్నదానం చేశారు. టోకన్లు లేకుండా 500 మందికి అన్నదానం చేశారు.

అన్నదానం చేస్తున్న తెలుగు యువత నాయకులు →



నాడు-నేడు పనుల ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని అచ్చుకట్ల ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులు ఎట్టకేలకు పునఃప్రారంభించారు. అసంపూర్తిగా ఉన్న పనులపై 'ఈనాడు'లో 'నాడు-నేడు పనులకు చెదలు' 'నీరివ్వని శుద్ధి యంత్రాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అచ్చుకట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయిని బ్యాంకులోని నిధులు డ్రా చేసి శుద్ధి యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.

మట్టి తోలారు

స్పందనకు వందనం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని 16వ వార్డు కర్ణకమ్మ వీధిలో పొక్లెయిన్‌తో చెత్తను తొలగించే క్రమంలో గుంట ఏర్పడింది. వర్షపు నీరు నిల్వతో దోమలు వ్యాప్తి చెందడంతో సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు మట్టితోలి చదును చేశారు.

నిమ్మ సాగులో జాగ్రత్తలు పాటించాలి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: నిమ్మ సాగు చేసే రైతులు మెళకువలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శశిధర్ తెలిపారు. కానూరులో మంగళవారం కలుపు నివారణ, ప్రకృతి వ్యవసాయం మీద రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానాధికారి శరద, శ్రీరాములు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: రైతులు పంటసాగులో పురుగు మందుల వినియోగం తగ్గించాలని రాస్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమ అన్నారు. మండలంలోని చింతగుంట, గుండ్లసముద్రం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నిమ్మ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాయక్, రాస్ శాస్త్రవేత్త మోహన్, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్, శాస్త్రవేత్త రాజీవన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు మీటర్లు ఇవ్వాలని వినతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పొగ్గొట్టం కాలనీవాసులు విద్యుత్తు మీటర్లు ఇవ్వాలని ఏఈ వెంకటస్వామికి మంగళవారం వినతి పత్రం అందించారు. 30 ఏళ్లుగా నివాసాలు ఉంటున్నా విద్యుత్తు మీటర్లు లేక తిప్పలు పడుతున్నామన్నారు.

క్రైం కార్నర్

ఉత్తరప్రదేశ్‌వాసికి గాయాలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట బిరదవాడ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి హరిప్రసాద్ గాయపడ్డారు. మేనకూరులోని ఓ కంపెనీలో హరిప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. బిరదవాడ వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రహదారిలో కొణ్ణంబట్టు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సూళ్లూరుపేటలోని పాలవల్లివారి వీధికి చెందిన స్కూటరిస్టు సోనుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో చోరీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పాత ట్రెజరీ వీధికి చెందిన వినయ్ ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి చోరీ చేశారు. వినయ్ ఆటోను ఇంటి వద్ద నిలిపి ఉంచగా.. మంగళవారం ఉదయం ఆటో కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల యువతి అదృశ్యమైందని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరులో మహిళపై దాడి చేసిన కేసులో నాగార్జునపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితురాలు మెరిం గీత ఫిర్యాదు మేరకు సీఐ సంఘమేశ్వరరావు మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు.